సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో సీపీఎం నాయకులు

గోల్కొండ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా కించపరిచేలా వాఖ్యలు చేయడం సరికాదని సీపీఎం నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ అన్నారు. అంబేడ్కర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బుధవారం లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను అవమానించే వాఖ్యలు అమిత్‌షా చేయడం బీజేపీకి దళితులపై ఉన్న అభిమానం ఏపాటిదో తెలిసిపోయిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి తక్షణ కర్తవ్యం అన్నారు. సీపీఎం నాయకులు వెంకటస్వామి, సుధాకర్, రమేష్, జనార్దన్, నర్సమ్మ, స్వర్ణ, లక్ష్మమ్మ, కళ్యాణ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి సీపీఎం కృషి

రాజేంద్రనగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతితోపాటు పేదల ప్రజలు, కార్మిక కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం అవిశ్రాంత పోరాటం చేస్తున్నదని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పేర్కొన్నారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తాలో మండల కమిటీ సభ్యుడు కాలే రాజు అధ్యక్షతన సీపీఎం నూతన జెండాను యాదయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలనలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని భూమి పెద్ద ఎత్తున కబ్జాకు గురైందన్నారు. బస్తీలు, కాలనీల్లో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల మధ్యలో ఉన్న స్థలాలు కూడా కబ్జాకు గురయ్యాయన్నారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్ర కుమార్, మండల కమిటీ సభ్యులు ఎస్.రామ్మోహన్, ఎస్.జంగయ్య పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కాచిగూడ: ప్రార్థించే పేదవుల కన్నా సాయపడే చేతులే మిన్న.. సేవను మించిన దైవం లేదు.. సేవలోనే దేవుడు దాగి ఉన్నాడన్నది అక్షర సత్యం.. ఇదే స్ఫూర్తిని కలిగిస్తూ సేవలకు ప్రతిరూపంగా నిలుస్తున్న కాసుల అనసూయ-వెంకటేశం చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని 8వ ఏఎంఎస్‌జే స్పెషల్ జడ్జి జె.మైత్రేయి అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాసుల అనసూయ వెంకటేశం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మందులను అందజేశారు. ప్రముఖ సంఘ సేవకురాలు కాసుల అనసూయమ్మ శ్రీవీరభద్రస్వామి సేవా సమితిని స్థాపించి పలు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. కాసుల అనసూయమ్మ అడుగుజాడల్లో వారి కుటుంబ సభ్యులు ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభిందనీయమని అన్నారు.

వైభవంగా ధన్వంతరి జయంతి ఉత్సవం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని వివేకానంద కేంద్రంలో ఆరోగ్య భారతి తెలంగాణ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రతి మనిషి ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని అన్నారు. మితమైన ఆహారం తీసుకుంటూ వ్యాయామం లేక యోగా చేయాలన్నారు. రంగాచార్యులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య భారతి ప్రతినిధులు చంద్రమౌళి, రామలింగేశ్వర్‌రావు, భరత్‌భూషణ్, రామచందర్, నర్సింహారావు, కేశవరావు, దేశ్‌పాండే, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



గౌలిపురా: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లలితాబాగ్ వద్ద బుధవారం ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి (55) మృతదేహం బయటపడింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవర్స్..!

- పట్టుబడిన మందుబాబులు
- వాహనాలు సీజ్ చేసిన పోలీసులు

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు

యాకుత్‌పురా: న్యూయర్ వేడుకల సందర్భంగా మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్‌లో 30 కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా మంగళవారం రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. దారుషిఫా, సాలార్‌జంగ్ రోటరీ, ఎంజీబీఎస్ బస్‌స్టేషన్ ప్రాంతాల్లో మొత్తం 30 కేసులు నమోదు చేశామన్నారు. అందులో 26 ద్విచక్ర వాహనదారులు, 2 కార్లు, 2 ఆటో డ్రైవర్లు మద్యం సేవించి వాహనలు నడిపినట్లు గుర్తించామని తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్‌కు పంపించమన్నారు. ఈ డ్రైవ్‌లో ఎస్సైలు అమర్‌నాథ్‌రెడ్డి, నాగూర్ పాషా, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మెహిదీపట్నంలో అడిషనల్ డీసీపీ రవీందర్‌రెడ్డి, ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణగౌడ్



మీర్‌చౌక్ ఠాణా పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్, సిబ్బంది



డీఎంఆర్‌ఎల్ సమీపంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్ర కుమార్

చాంద్రాయణగుట్ట పరిధిలో 75 మందిపై కేసులు

సంతోష్‌నగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసులు, సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంఆర్‌ఎల్ సమీపంలోని సాయిబాబా దేవాలయం వద్ద డ్రంకెన్ డ్రైవ్‌ను ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో మొత్తం 75 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో 60 ద్విచక్ర వాహనాలు, 11 కార్లు, నాలుగు ఆటోలు ఉన్నాయన్నారు.

సంతోష్‌నగర్ పరిధిలో 91 వాహనాలు సీజ్

సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ నరసింహా నాయక్ ఆధ్వర్యంలో చంపాపేట్‌లోని ఎంఎన్ఆర్ గార్డెన్, శంకేశ్వరబజార్, సరూర్‌నగర్ కట్ట వద్ద ట్రాఫిక్ ఎస్సైలు వెంకటప్ప, సత్యనారాయణ నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 91 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో 65 ద్విచక్ర వాహనాలు, 17 ఫోర్ విల్లర్స్, 8 ఆటోలు, ప్రైవేటు బస్సు ఒకటి ఉందన్నారు.

సుల్తాన్‌బజార్ ఠాణా పరిధిలో 47మందిపై కేసు



కోఠిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీసులు

సుల్తాన్‌బజార్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 47మంది మందుబాబులు ట్రాఫిక్ పోలీసులకు చిక్కారు. నూతన సంవత్సర వేడుకలు ఎంజాయ్ చేసేందుకు కొందరు మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి పోలీసులకు చిక్కారు. మోతాదుకు మించి మద్యం సేవించిన వారి బైక్‌లు, ఆటోలు, కార్లను సీజ్ చేసినట్లు సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు.

ఆసిఫ్‌నగర్ ఠాణా పరిధిలో పట్టుబడిన 54 మంది..

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మెహిదీపట్నం సరోజినీ దేవి కంటి ఆసుపత్రి, గుడిమల్కాపూర్ యాదవ భవన్ చౌరస్తా తదితర ప్రాంతాలలో తెల్లవారుజాము వరకు నిర్వహించిన తనిఖీల్లో 54 మంది పట్టుబడ్డారు. మోతాదుకు మించి మద్యం సేవించినట్లు ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ గౌడ్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను అడిషనల్ డీసీపీ రవీందర్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

చిత్రగుప్తా దేవాలయంలో వేడుకలు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లా సంఘం స్వర్ణోత్సవాల్లో భాగంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ స్థానిక చిత్రగుప్తా దేవాలయంలో దేవాలయ దర్శనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివానంద స్వామి పాల్గొని భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. జిల్లా అధ్యక్షులు సరాబు లక్ష్మణ్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు కాశెట్టి పండు, నాగభూషణం, కూర జయారములు, ఐపీపీ మ్యాడం దయాకర్, కటకం శివకుమార్, లింగం ప్రకాష్, విశ్వేశ్వరయ్య, శ్రీరాం కోటయ్య, మల్లికార్జున్, సరాబు ఉదయ్ భాస్కర్, ఇరుకుల్ల భిక్షపతి పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలబడాలి



గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీల్లో పనిచేసే వారికే ప్రాధాన్యం ఉంటుందని ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ అన్నారు. బుధవారం అధ్యక్షుడు ఆబేద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు పోలీసులు, ప్రజల మధ్య వారధిగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పైరవీలు చేయకుండా బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. యువకులకు పీస్ అండ్ మైత్రి కమిటీల్లో సభ్యత్వం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. తహసీన్ పాషా, ఇలియాజ్ అలీ, పరమానందం, ఖైరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



శాలిబండ: విద్యుత్ మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు.. చందులాల్ బారదరి, బారదరి ఆఫీస్, ఖాజా ఫంక్షన్ హాల్, రామ్నాస్‌పురా, బహదూర్‌పురా, ప్రిన్స్ కాలనీ, జూపార్కు, ఈగల్ రబ్బర్, జియ్‌కట్, మెర్క్యూరీ, ఇండస్ట్రియల్ ఏరియా, బిలాల్‌నగర్, దోపాషా దర్గా, వహేద్‌లాల్, అంజదుల్లాబాగ్, అలీబాగ్, మక్బరా, కమేలా, రహీంపురా, ఐటీఐ కాలనీ, మోచీ కాలనీ, ఎస్సార్టీ కాలనీ, 2ఆర్టీ కాలనీ, అబ్దుల్లా షా దర్గా, గుల్షన్‌నగర్, దూద్‌బౌలి, కామాటిపురా, చటక్నీపురా, ఎస్‌బీహెచ్ బ్యాంక్, మిశ్రీగంజ్, చిరాగ్ అలీ నాల్, ఫతేదర్వాజా రోడ్డు, మోయిన్‌పురా, కెఎం ఖాన్, కుమ్మర్‌వాడీ, ఘాజిబండ, మమతా నర్సింగ్ హోమ్, యాయా పాషా దర్గా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

మోతీ మార్కెట్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: మోతీ మార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని నింబోలి అడ్డా, కుర్మీజైల్, ఏకే పేపర్ మిల్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుననట్లు అధికారులు తెలిపారు. రంగ్‌మహాల్ ఫీడర్ పరిధిలోని రంగ్‌మహాల్, ఉస్మానియా మెడికల్ కాలేజీ, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆదిత్య ఆసుపత్రి లేన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, సిబీఐ, ట్రూప్‌బజార్ ఫీడర్ల పరిధిలోని గుజరాతీ గల్లీ, సీబీఐ, రామకృష్ణ థియేటర్, అస్నాబజార్, నోబుల్ ప్లాజా, విజయ్ మార్కెట్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శాస్త్రీయ కళలు మన వారసత్వ సంపద



గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత కళలు మన వారసత్వ సంపద అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో కళారాధన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరిట క్లాసికల్ నృత్య సంగీత ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వారసత్వ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కళలను నేటి తరానికి నేర్పిస్తూ.. వాటి పరిరక్షణ, కొనసాగింపునకు పాటుపడుతున్న సంస్థల కృషి అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతిరావు, రచయిత పీఎస్.మూర్తి, నాట్య గురువు ఘంటసాల పవన్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకులు జయంతి పాల్గొన్నారు.

తిరుమల శ్రీనివాసాచార్య రచనలు మార్గదర్శనం కావాలి

గన్‌ఫౌండ్రీ: ప్రపంచానికే ఆదర్శమైన భారతీయ కుటుంబ వ్యవస్థలో విలువలు, అనుబంధాలు కనుమరుగవుతున్నాయని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్ అన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ అనే నినాదం ఇవ్వాల్సిన పరిస్థితికి సమాజం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రవీంద్రభారతిలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీవేత్త ఆచార్య తిరుమల శ్రీనివాసాచార్య 87వ జన్మదిన వేడుకల్లో జస్టిస్ భవానిప్రసాద్ పాల్గొని మాట్లాడారు. తిరుమల శ్రీనివాసచార్య రచనలు మార్గదర్శనం కావాలని సూచించారు. అనంతరం శ్రీనివాసాచార్యకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, రసమయి వ్యవస్థాపకులు ఎం.కే.రాము పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



మహా పడిపూజలో కట్ట నాగేందర్

అబిడ్స్: అయ్యప్పస్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. బుధవారం గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర సాయిబాబా ఆలయంలో సదాశివ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ వైభవంగా జరిగింది. అయ్యప్పస్వాములు 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ భక్తిగీతాలు, భజనలతో ఆలపించారు. గణపతి హోమం, గోపూజ, కుంకుమార్చనల అనంతరం స్వామివారి మహాపడి ప్రారంభించారు. పెద్దఎత్తున స్థానిక ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట నాగేందర్ తదితరులు పూజలు చేశారు.

'ఎస్కీ'లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కోల్‌కతా బృందం

రాయదుర్గం: 'ఎస్కీ' క్యాంపస్‌ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కోల్‌కతా అధికారులు బుధవారం సందర్శించారు. 'ఎస్కీ' డైరెక్టర్ రామేశ్వరరావుతో సమావేశమయ్యారు. అనంతరం క్యాంపస్‌లోని ఎస్‌పీజీఎస్ కళాశాల ఏర్పాటు, నిర్వహించే కోర్సులు, ఎస్కీలో ఏడాది పొడవునా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కాలేజీ ప్రాంగణంలో 3 నెలల్లో నిర్మించిన సెంచరీ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు అంతర్జాతీయ సమావేశాలు జరిగాయని డైరెక్టర్ రామేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చీఫ్ లక్ష్మీకాంతారావు, అమర్‌నాథ్, రాజారావు, డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, ఎస్కీ, ఎస్‌పీజీఎస్ కళాశాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ రంగ నాయకుల కాలనీలోని జేరుసలేం కవనెంట్ చర్చిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. పాస్టర్ రెవరెండ్ ఎ.మున్యా మోజెస్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. 2025వ సంవత్సరంలో దేవుని సన్నిధి అందరిపై ఉంటుందని, ప్రతి కుటుంబం ప్రేమతో, అనురాగంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రుబీన్‌నాయక్, హెప్సీబాబాయి, చిన్ని బ్యూలా పాల్గొన్నారు.

గోల్కొండ పోలీసుల పనితీరు భేష్

సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్



గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్

గోల్కొండ: గోల్కొండ పోలీసుల పనితీరు అత్యుత్తమంగా ఉందని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఆయన వార్షిక తనిఖీల సందర్భంగా గోల్కొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లోని వివిధ కౌంటర్ల సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రిసెప్షన్, జేడీ సెక్షన్, ఎస్సైల కౌంటర్లు తదితర వాటిని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఆయా కౌంటర్ల సిబ్బందితో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో ఏ విధంగా మాట్లాడుతారు.? ఎఫ్ఐఆర్ ఎప్పుడు నమోదు చేస్తారు? వంటి తదితర విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పోలీసులు అంటే ప్రజల్లో గతంలో లాగా భయం పోయిందని ప్రజలు పోలీసులు అంటే గౌరవ భావంతో చూస్తున్నారని అన్నారు.

- నేర నియంత్రణ, నేరాల అదుపు తదితర విషయాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులకు సహకరిస్తున్నారని అన్నారు. తెలంగాణ పోలీసుల పనితీరు దేశంలోనే అత్యుత్తమంగా ఉందని పోలీసులు అంటే నేరగాళ్ల వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసులు సమాజంలో స్త్రీల పట్ల ఏ విధంగా వ్యవహరించాలనేది ప్రజలకు తెలియజేస్తున్నారని చెప్పారు. స్థానికంగా జరిగే పండుగలు, జాతరల సందర్భంగా శాంతిభద్రతలు కాపాడటంలో స్థానికులతో కలిసి ముందుకు సాగాలని సూచించారు.
- సంవత్సర కాలంలో గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదులు, నేరస్తుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తులు, నగదు వివరాలు తదితర వాటిని ఆయన అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు రోజుకో పద్ధతిలో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని సైబర్ నేరగాళ్ల దోపిడీ విధానాన్ని ప్రజలకు వీలైనప్పుడల్లా తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రికి సత్కారం



గన్‌ఫౌండ్రీ: పలు కవితలు, రచయితల్లో ప్రతిభ చూపిన కవయిత్రి ప్రసన్న కిరణ్‌ను ఘనంగా సత్కరించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే కవితలు, నిరంతరం కొత్త తరహాలో రాస్తూ సమాజ ప్రగతికి కృషి చేస్తానన్నారు. మహర్షి వాల్మీకి వ్యవస్థాపకులు డాక్టర్ ఈడీ.రాజగోపాల్ జన్మదినం సందర్భంగా సన్మానించినట్లు చెప్పారు. కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ పాల్గొన్నారు.

చిన్నారులను శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలి



గన్‌ఫౌండ్రీ: నేటితరం చిన్నారులను పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ సంగీత కళల్లో ప్రోత్సహించాలని పలువురు వక్తలు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో శివానీ ఆర్ట్స్ అసోసియేషన్, రుద్రశివ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి సాధు శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. శాస్త్రీయ కళలు మన వారసత్వ సంపద అని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రముఖ నాట్య గురువు వనం కవితకు నవరస నాట్య మయూరి బిరుదును ప్రదానం చేశారు. చిన్నారుల కూచిపూడి నృత్య రూపకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భక్తి భజన సంకీర్తన ప్రచార పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు జేఎస్‌వీ శివప్రసాద్, మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పాదం అకాడమీ అధ్యక్షులు అర్చన, నిర్వాహకులు రాంచంద్రరావు, రంగస్థల కళాకారులు దొంతి జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సర వేడుకలను మంగళవారం రాత్రి నుంచి చార్మినార్/అబిడ్స్/మెహిదీపట్నం జోన్ పరిధిలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. 2024 సంవత్సరానికి సెలవంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాలనీల సంఘాలు, బస్తీ నేతలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు బుధవారం ఒకరినొకరు కలుసుకుని న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొందరు నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ పెద్దలను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో కేలండర్లు, డైరీలను ఆవిష్కరింపజేశారు. – చార్మినార్/అబిడ్స్/మెహిదీపట్నం జోన్ బృందం



ఎస్‌బీఎస్ కేలండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్ దర్శన్



ఎమ్మెల్యే కౌసర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మజ్లిస్ నాయకులు



ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలిపి సత్కారించారు



కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్